

కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న రాజగోపాల్‌పేట గ్రామస్తులు


నమస్తే తెలంగాణ

సిద్దిపేట

I హైదరాబాద్, శనివారం 22 మార్చి 2025 SIDDIPET


## 'గీతం' ఎంబీఏ కోర్సుకు ఎన్‌బీఏ అక్రిడిటేషన్

పటాన్‌చెరు, మార్చి 21: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ ప్రాంగణంలోని స్కూల్ ఆఫ్ బిజినెస్ నిర్వహిస్తున్న మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ) కోర్సుకు ప్రతిష్టాత్మక నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) న్యూఢిల్లీ మంజూరు చేసినట్టు విశ్వవిద్యాలయ వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ గుర్తింపు జూన్ 30, 2028 వరకు మూడేండ్ల పాటు అమల్లో ఉంటుందని తెలిపారు. డీమ్డ్ టు బి విశ్వవిద్యాలయ హోదాను 2007లో పొందిన తర్వాత గీతం అందుకున్న మొదటి ఎన్‌బీఏ అక్రిడిటేషన్ ఇది అని, వర్సిటీ చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతుందని గీతం ప్రతినిధులు పేర్కొన్నారు. హైదరాబాద్ ప్రాంగణంలోని ఎంబీఏ అధ్యాపకులు, అక్రిడిటేషన్ బృందాలను ఐక్యూఏసీ, అక్రిడిటేషన్ అండ్ ర్యాంకింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.రాజా ప్రభు, డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.మంజునాథ చారి అభినందించారని తెలిపారు. ఈ విజయంపై గీతం ఉన్నత నాయకత్వం తమ ఆనందాన్ని వ్యక్తం చేసింది. విద్యా నైపుణ్యం, నిరంతరం అభివృద్ధి పట్ల అచంచలమైన నిబద్ధతకు ఈ గుర్తింపు నిదర్శనమని ఉప కులపతి ప్రొఫెసర్ ఎర్రోల డిసౌజా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గుణశేఖరన్, అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరెక్టర్ డాక్టర్ దివ్య కీర్త గుప్తా తదితరులు పేర్కొన్నారు.

## కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

నంగునూరు, మార్చి 21: కాళేశ్వరం నీళ్లు కాలువల ద్వారా గ్రామానికి చేరడంతో హర్షం వ్యక్తం చేస్తూ సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని రాజగోపాల్‌పేట గ్రామస్తులు శుక్రవారం కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. రంగనాయక సాగర్ నుంచి రాజగోపాల్‌పేట పెద్ద చెరువుకు నీళ్లు రావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎండకాలంలో సైతం చెరువులు, కుంటలు మత్తళ్లు దూకించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కమల్ షరీఫ్, రంగురాజుగౌడ్, మల్లేశం, చందు, సత్తయ్య, నాగయ్య, లక్ష్మయ్య, యాదగిరి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట కలెక్టరేట్‌లో వినతి పత్రం ఇస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు

## డీ4 కెనాల్ ద్వారా సాగునీరందించాలి

- పెండింగ్ కాలువల పనులు పూర్తిచేయాలి
- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 21: తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి డీ4 కెనాల్ ద్వారా కొండపాక మండలంలోని రైతులకు సాగునీరు అందించాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు సిద్దిపేట కలెక్టరేట్‌లో డీఆర్వోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. డీ4 కెనాల్‌కు సాగునీళ్లు వదలకపోవడంతో కొండపాక మండలంలో డీ4 కెనాల్ ఆయకట్టులో 10 వేల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా, వినతి పత్రాలు సమర్పించినా చుక్కనీరు వదలక పోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. మెయింటెన్స్‌కు రూ.6 కోట్ల నిధులు అవసరమని, ఆ డబ్బులు ఇవ్వకపోవడంతో పంపులు స్టార్ట్ చేయలేకపోతున్నామని అధికారులు చెబుతున్నట్లు తెలిపారు. ఇది పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యమని విమర్శించారు. మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు కాలువ పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేసి పరిసర గ్రామాల ప్రజలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం దివాలా తీసిందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అనంతులు అశ్వినీప్రశాంత్, మాజీ ఎంపీపీ ర్యాగల సుగణదుర్గయ్య, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, మాజీ ఎంపీపీ రాధాకృష్ణారెడ్డి, నాయకులు జైపాల్‌రెడ్డి, పలు గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# దాహం తీరే దారేది!



సంగారెడ్డి జిల్లా మనూరు మండలం ఎల్గోయిలో మిషన్ భగీరథ నీరు రాక గ్రామంలోని బోరుమోటారు వద్ద నీటిని తీసుకెళ్తున్న గ్రామస్తులు



ఆరు రోజులుగా మిషన్ భగీరథ నీరు రాక వ్యవసాయ బోరు వద్ద నీరు తీసుకెళ్తున్న సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం రత్నానాయక్ తండావాసులు

- మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం
- వ్యవసాయ బోర్ల వద్దకు జనం పరుగులు
- సమస్య పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద/కంగ్టి/మనూరు, మార్చి 21: పదేండ్ల కేసీఆర్ పాలనలో ఇంటింటికీ నల్లాలతో నీటిని సరఫరా చేసిన మిషన్ భగీరథ పథకం ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురవుతున్నది. పథకం నిర్వహణపై పర్యవేక్షణ కరువై గ్రామాలకు రోజుల తరబడి నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దిక్కుతోచని స్థితిలో వ్యవసాయ బోర్లు, ప్రైవేట్ బోర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. వేసవి ఆరంభంలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే ఇక ముమ్ముందు వచ్చే నీటి కష్టాలను తలుచుకుని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య ఉత్పన్నం కాలేదు. మహిళలు నీళ్లకోసం బిందెలతో పొలాల వెంట వెళ్లే దృశ్యాలు బీఆర్ఎస్ హయాంలో కనుమరుగయ్యాయి అంటే అతిశయోక్తి కాదు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత మెల్లమెల్లగా తాగునీటి కష్టాలు తీవ్రమవుతున్న దృశ్యాలు గ్రామాల్లో కనిపిస్తున్నాయి. మిషన్ భగీరథ పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్యం ఫలితంగానే రోజుల తరబడి నీరు గ్రామాలకు సరఫరా కావడం లేదని తెలుస్తున్నది. సమస్య మరింత తీవ్రతరం కాకమునుపే మిషన్ భగీరథ పథకం నిర్వహణతో పాటు ప్రత్యామ్నాయ చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో ప్రజలు దాహం తీరే దారులు వెతుక్కుంటూ వెళ్లక తప్పదని చెప్పడంలో సందేహం లేదు. గ్రామాల్లో నీటి సమస్యపై 'నమస్తే తెలంగాణ' దృష్టి సారించి నాగల్‌గిద్ద, కంగ్టి, మనూరు మండలాల్లో పర్యటించింది. ఈ నేపథ్యంలో గ్రామాలు, తండాల్లో నెలకొని ఉన్న నీటి సమస్య బహిర్గతమైంది. తాగునీటి కోసం ప్రజలు పడుతున్న బాధలు వర్ణణాతీతం.



సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం బోర్గిలో ప్రైవేట్ బోరు నుంచి నీటిని తీసుకెళ్తున్న మహిళలు

## ఎకరాకు రూ. 30వేల పరిహారం చెల్లించాలి



పాండండలో ఎండిన వరిపొలాన్ని పరిశీలిస్తున్న తెలంగాణ రైతురక్షణ సమితి సభ్యులు

- తెలంగాణ రైతు రక్షణ సమితి సభ్యుల డిమాండ్

శివ్వంపేట, మార్చి 21: గ్రామాల్లో పంటలు ఎండిపోయి నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ. 30వేల చొప్పున పంటనష్ట పరిహారం ప్రభుత్వం చెల్లించాలని తెలంగాణ రైతురక్షణ సమితి మెదక్ జిల్లా గౌరవాధ్యక్షుడు అక్కమొల్ల మైసయ్య యాదవ్ డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పాంబండ, ఉసిరికపల్లి, శంకర్ తండాల్లో ఎండిన పంటపొలాలను శుక్రవారం తెలంగాణ రైతురక్షణ సమితి సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్చి నుంచే పంటలు ఎండుముఖం పట్టడం బాధాకరమని, మరో నెలరోజుల వరకు పంటలకు నీరు పెట్టాల్సి ఉంటదని, రైతులందరూ ఆందోళనకు గురవుతున్నట్లు తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎండిన పంటల వివరాలు సేకరించాలన్నారు. ఏప్రిల్ రెండో వారంలో రైతులకు క్రాప్‌లోన్‌కు సంబంధం లేకుండా అదనంగా రూ. లక్ష రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతుల పంటకు బీమా కట్టకపోవడంతో రైతులకు నష్టం జరుగుతున్నదని, రైతులకు ఆశచూపి అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ మరిచిపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రైతుభరోసా, రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. రైతుల పక్షాన రాబోయే రోజుల్లో రోడ్లపై వంటావార్పు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతురక్షణ సమితి జిల్లా ఉపాధ్యక్షుడు అంతంగారి వెంకటేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి నర్సారెడ్డి, రైతులు ఉన్నారు.

### రూ. 2 లక్షలతో మూడుబోర్లు వేసినా నీరు రాలే

నాకున్న నాలుగెకరాల్లో దాదాపు లక్షా 20వేల రూపాయల అప్పు తెచ్చి వరిపంట వేశాను. వేసిన పంట మొత్తం ఎండిపోయింది. నా పంటను చూస్తే పొలానికి కూడా రాబుద్ది కావడం లేదు. పంటను కాపాడుకోవాలని రూ. 2 లక్షల అప్పులు చేసి మూడు బోర్లు వేయించినా చుక్కనీరు పడలేదు. మొత్తం అప్పులపాలైన. పెండ్లాం, పిల్లలు బతకడానికే కష్టమైంది. ప్రతిసారి పంట వేసుకున్న, కానీ ఎప్పుడూ ఎండిపోలే. కాంగ్రెస్ సర్కార్ నాకు రైతుబంధు పైసల్ వేయలేదు. రుణమాఫీ కాలేదు. సర్కార్ నన్ను ఆదుకోవాలి.

–నాగనొల్ల మల్లయ్య, రైతు, పాంబండ

# కాంగ్రెస్ పాలనలో రైతుల అరిగోస

- కాళేశ్వరంపై కాంగ్రెస్ అబద్ధాల ప్రచారం
- గత ప్రభుత్వంలో గోదావరి 365 రోజులు నిండుకుండలా ఉండేది
- నీళ్లు నింపకపోతే మూకుమ్మడి ఆమరణ దీక్ష చేపడతాం..
- మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కోరుకంటి చందర్
- సిద్దిపేటకు చేరిన 'గోదావరి కన్నీటి గోస' మహాపాదయాత్ర



సిద్దిపేటలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

సిద్దిపేట అర్బన్, మార్చి 21: గోదావరి పరీవాహక రైతులు సాగునీరు లేక అరిగోస పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. 'గోదావరి కన్నీటి గోస' పేరుతో గోదావరి నది నుంచి కొండపోచమ్మసాగర్ వరకు కోరుకంటి చందర్ చేపట్టిన మహా పాదయాత్ర గురువారం రాత్రి సిద్దిపేట పట్టణానికి చేరింది. శుక్రవారం సిద్దిపేటలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో నీటి సమస్య ఉండకూడదని, ఆత్మహత్యలు లేని తెలంగాణ కావాలని కేసీఆర్ మిషన్ కాకతీయ పేరుతో చెరువుల పునరుద్ధరణ చేపట్టారన్నారు. ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించాలనే గొప్ప ఉద్దేశంతో మిషన్ భగీరథ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నీటి దిశను మార్చి తెలంగాణ దశను మార్చేందుకు కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించారన్నారు. కేసీఆర్ ప్రతి ఎకరాకు నీళ్లు అందించాలనే గొప్ప పరిపాలన చేస్తే.. ఎన్నికల సమయంలో కాళేశ్వరం కూలిపోయిందని అనేక అబద్ధపు, మోసపు ప్రచారాలు చేసి ప్రజలను తప్పదోవ పట్టించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. గోదావరి పరీవాహక ప్రాంతంలోని ప్రజలంతా నేడు అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అబద్ధాన్ని నిజం చేయడానికి, మరో వంద అబద్ధాలు ఆడుతూ 15 నెలలుగా గోదావరిని ఎండబెడుతున్నారని మండిపడ్డారు.

**కేసీఆర్‌కు పేరురావద్దని కాంగ్రెస్ కుట్రలు..**

కాళేశ్వరం ప్రాజెక్ట్ పటిష్టంగానే ఉందని ఇటీవల మంత్రి ఉత్తమ్ చెప్పినప్పటికీ ఎందుకు నీటిని ఎత్తిపోయడం లేదని కోరుకంటి చందర్ ప్రశ్నించారు. కేసీఆర్‌కు మంచి పేరు వస్తదని మేడిగడ్డ బరేజ్‌కు ప్రభుత్వం మరమ్మతులు చేపట్టడం లేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో 365 రోజులు నిండుకుండలా ఉన్న గోదావరిలో తాను ఐదేండ్ల పాటు పడవల పోటీలు నిర్వహించానని గుర్తుచేశారు. గోదావరి ఎండిపోయిన కారణంగా రామగుండం నియోజకవర్గంలో పదిరోజులకు ఒకసారి నీళ్లు వచ్చే పరిస్థితి ఏర్పడిందన్నారు. అసమర్థ పాలన వల్లనే గోదావరి నది ఎండిపోయిందని, ఈ విషయాన్ని ప్రజలకు తెలియజెప్పడానికే 180 కి.మీల పాదయాత్ర చేపట్టినట్లు చెప్పారు. బీఆర్ఎస్, కేసీఆర్ మీద కోపంతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం తగదని కాంగ్రెస్ ప్రభుత్వానికి హితవు పలికారు. అందుకే ఎండిపోయిన గోదావరి నుంచి కొండపోచమ్మసాగర్‌కు పాదయాత్రగా బయల్దేరినట్లు తెలిపారు. తాము పాదయాత్రగా వెళ్తుంటే ఏ గ్రామానికి వెళ్లినా నీళ్లు రావడం లేదని రైతులు బాధ వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. నీళ్లకోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని కోరుకంటి చందర్ హెచ్చరించారు. సిద్దిపేట పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, నాయకులు వంగ తిరుమల్‌రెడ్డి, రవీందర్, రాజ్‌కుమార్, వెంకటేశ్, భాస్కర్, దేవరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### దుద్దెడకు చేరుకున్న కోరుకంటి పాదయాత్ర

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 21: రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పాదయాత్ర శుక్రవారం సాయంత్రం కొండపాక మండలంలోని దుద్దెడకు చేరుకుంది. కోరుకంటి చందర్‌కు బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పూలమాల వేసి శాలువాతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. అనంతరం రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి దుద్దెడలో ఎండిపోయిన పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అనంతులు అశ్వినీప్రశాంత్, మాజీ ఎంపీపీ ర్యాగల సుగణాదుర్గయ్య, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, మాజీ ఎంపీపీ రాధాకృష్ణారెడ్డి, నాయకులు జైపాల్‌రెడ్డి, పలు గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



దుద్దెడలో కోరుకంటి చందర్‌కు స్వాగతం పలుకుతున్న ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

## ఎమ్మెల్యేపై కేసు కొట్టివేత

నర్సాపూర్,మార్చి 21 : నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డితో సహా 11 మందిపై కేసును హైకోర్టు కొట్టివేసిందని న్యాయవాది కొల్కూరి అఖిల్‌రెడ్డి తెలిపారు. వెల్దుర్తి మండలం శెట్‌పల్లి హల్దీవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని 2018 జూన్ 2న వెల్దుర్తి అంబేద్కర్ చౌరస్తాలో వాహనాలను ఆపి ధర్నా నిర్వహించగా, వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డితో పాటు తలారి మల్లేశం, తలారి హన్మేశ్, శ్రీనివాస్‌రెడ్డి, షేకాగౌడ్, జైరాంరెడ్డి, శ్రావణ్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, పడిగె నర్సింహులు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మెదక్ జూనియర్ సివిల్ కోర్టు నుంచి నాంపల్లి కోర్టుకు కేసును బదిలీ చేశారు. అక్కడ కేసు పెండింగ్‌లో ఉండడంతో హైకోర్టులో సీనియర్ అడ్వకేట్ జనార్దన్‌రెడ్డి తనయుడు అడ్వకేట్ కొల్కూరి అఖిల్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటీషన్ వేశారు. విచారించిన హైకోర్టు జడ్జి ఎం.లక్ష్మణ్ ఈ కేసును కొట్టివేశారు. ఈ కేసులో ఉన్న ముప్పిడి జయరాంరెడ్డి ఇటీవల మృతిచెందారు. కేసు కొట్టివేయడంతో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

## దవాఖాన నుంచి పరీక్షా కేంద్రానికి..



అంబులెన్స్‌లో వచ్చి పరీక్ష రాసి తిరిగి వెళ్తున్న శ్వేత

సిద్దిపేట అర్బన్, మార్చి 21: సిద్దిపేట పట్టణ పరిధిలోని రంగధాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద అరుదైన సంఘటన చోటు చేసుకుంది. సిద్దిపేట పట్టణం హనుమాన్‌నగర్‌కు చెందిన పర్వతం శ్వేత అనే విద్యార్థిని మండల పరిధిలోని మిట్టపల్లి గురుకుల పాఠశాలలో చదువుతున్నది. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్వేత కాలు విరిగింది. సిద్దిపేటలోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతుంది. శ్వేతకు గురువారం రాత్రి వైద్యులు సర్జరీ చేశారు. శుక్రవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమైన దృష్ట్యా విద్యార్థిని తండ్రి శంకర్ శ్వేతను అంబులెన్స్‌లో పరీక్షా కేంద్రానికి తీసుకువచ్చి పరీక్ష రాయించారు. ఎలాగైనా పరీక్ష రాస్తానని శ్వేత చెప్పడంతో అంబులెన్స్ ద్వారా పరీక్షా కేంద్రానికి తీసుకువచ్చి స్ట్రెచర్‌పైనే పరీక్ష రాయించారు. పరీక్ష పూర్తయిన వెంటనే శ్వేతను మళ్లీ దవాఖానకు తీసుకెళ్లారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సైతం విద్యార్థినితో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పినట్లు శ్వేత తండ్రి శంకర్ తెలిపారు.

### దు:ఖం దిగమింగుకుని...

నర్సాపూర్, మార్చి 21 : తెల్లారితే పదో తరగతి పరీక్షలు. అంతలోనే అనారోగ్యంతో నాన్నమ్మ చనిపోవడంతో ఇంట్లో విషాదం నెలకొంది. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన గుండె రామకృష్ణ అదే గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. గురువారం రాత్రి రామకృష్ణ నాన్నమ్మ అనారోగ్యంతో కన్నుమూసింది. మృతురాలికి ఇద్దరు కుమారులు. వారిద్దరు గతంలోనే మృతి చెందడంతో మనుమడైన రామకృష్ణ తలకొరిమి పెట్టడం అనివార్యమైంది. పరీక్షకు హాజరు కావాలా వద్దా అన్న సందిగ్ధంలో ఉన్న రామకృష్ణకు తనతల్లి సంతోష సూచనతో బరువెక్కిన హృదయంతో, కన్నీళ్లను దిగమింగుకొని పరీక్షకు హాజరయ్యాడు. పరీక్ష రాసి వచ్చిన అనంతరం తలకొరిమి పెట్టి అంత్యక్రియలు పూర్తిచేయించారు.

# గాలివాన బీభత్సం



మెదక్ జిల్లా కొల్చారంలో గాలివానకు నేలమట్టమైన హర్షిత రెస్టారెంట్



ధ్వంసమైన మరో దుకాణం



కొల్చారం: పోతంశెట్‌పల్లి వైన్స్ సమీపంలో గాయపడ్డ వ్యక్తిని దవాఖానకు తరలిస్తున్న స్థానికులు

- ఉమ్మడి మెదక్ జిల్లాలో కురిసిన అకాల వర్షం
- హడలెత్తించిన ఈదురుగాలులు
- పిడుగుపాటుకు గేదెలు మృతి
- పలుచోట్ల పడిపోయిన స్తంభాలు, విద్యుత్ వైర్లు
- నేలరాలిన మామిడి.. చల్లబడ్డ వాతావరణం

మెదక్, (నమస్తే తెలంగాణ), జహీరాబాద్/ మెదక్ మున్సిపాలిటీ/ చిలిపిచెడ్/ రాయికోడ్/ నిజాంపేట/ జగదేవపూర్/ కొల్చారం/ చిన్నశంకరంపేట, మార్చి 21: అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, గాలిదుమారంతో కూడిన వర్షం కురిసింది. పలుచోట్ల చెట్లు నేలకూలాయి. విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. ఇండ్లు, దుకాణాలపైన ఉన్న రేకులు ఎగిరిపోయాయి. వర్షానికి వరిపంటకు కాస్త ఉపశమనం లభించింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మెదక్ జిల్లా కేంద్రంలోని జంబికుంట వీధిలో పిడుగుపడి వడియారం సిద్ధయ్య అనే వ్యక్తి ఇంటి పైభాగంలోని పెంట్‌హౌస్ వెల్‌వేషన్ స్వల్పంగా ధ్వంసమైంది. ప్రాణ నష్టం జరగలేదు. చిలిపిచెడ్ మండలంలో కురిసిన వర్షానికి వీధులు, రోడ్లన్నీ జలమయంగా మారాయి. కొల్చారం మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. కొల్చారంలోని పలు దుకాణ సముదాయాల రేకులు ఎగిరిపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకూలగా, విద్యుత్ తీగలు రోడ్డుపై తెగిపడ్డాయి. చెట్లు సైతం రోడ్డుపై పడడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. కొల్చారం జాతీయ రహదారి పక్కనే ఉన్న ఏడుపాయల టీ జంక్షన్ వద్ద హర్షిత రెస్టారెంట్ రేకులు ఎగిరిపోయి లోపల ఉన్న గోడలు, ఫర్నిచర్, ఏసీలు, ఇతర సామగ్రి దెబ్బతిన్నాయి. కొల్చారంలో హర్షిత రెస్టారెంట్ యజమాని రాజు గతేడాది రెస్టారెంట్ నిర్మించగా, గాలివాన బీభత్సానికి పూర్తిగా నేలమట్టమైంది. పోతంశెట్‌పల్లి చౌరస్తాలో కొన్ని రేకుల షెడ్డులు ఎగిరిపోయి 200 మీటర్ల దూరంలో పడ్డాయి. కిరాణ సామగ్రి చిందరవందరయ్యాయి. పోతంశెట్‌పల్లి వైన్స్ సమీపంలో కరెంటు పోలు విరిగిపడి ఓ వ్యక్తికి రెండు కాళ్లు విరిగాయి. అతన్ని అంబులెన్స్‌లో మెదక్ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఏడుపాయలకు వెళ్లే దారిలో రేకుల షెడ్డు అమాంతం పైకి ఎగిరి అగి ఉన్న కారుపై పడింది. అందులో ఉన్న ఇద్దరు అదృష్టవశాత్తు తప్పించుకున్నారు. ఏడుపాయల సమీపంలో రేకుల షెడ్లు గాలిదుమారానికి ఎగిరిపోయి రోడ్డుపై వెళ్తున్న ఆటోపై పడిపోయాయి. ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. మెదక్– హైదరాబాద్ రోడ్డుపై చెట్లు అడ్డంగా పడడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు చేరుకొని ట్రాఫిక్ క్లియర్ చేశారు. చిన్నశంకరంపేట మండలం జంగరాయి వాగు వద్ద చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. మండలంలో గాలిదుమారంతో పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్, మొగుడంపల్లి మండలాల్లో భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లో కోతకు వచ్చిన జొన్నపంట నేలకొరిగింది. శనగ తదితర పంటలకు కొంతమేరకు నష్టం జరిగినట్టు రైతులు తెలిపారు. జహీరాబాద్, రాయిడ్‌లో ప్రాంతంలో మామిడి కాయలు నేలరాలడంతో రైతులకు నష్టం జరిగింది. జొన్న, శనగ పంటలు దెబ్బతిన్నాయి. నిజాంపేట్‌లోని కూడలిలో ప్రధాన రహదారికి ఇరుపక్కల గల పెద్దచెట్లు విరిగి రోడ్డుపై పడడంతో గంటపాటు రాకపోకలకు అంతరాయం ఎర్పడింది. రోడ్డు పక్కన ఉన్న అనిల్‌గౌడ్‌కు చెందిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ ఈదురుగాలులకు దెబ్బతింది. హోటళ్లపై వేసుకున్న పైకప్పు రేకులు కొట్టుకుపోయాయి. నిజాంపేట్‌లో కడల రాజమణి అనే మహిళ ఇంట్లోకి వర్షంనీరు చేరింది. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. తీగుల్‌నర్సాపూర్ కొండపోచమ్మ దేవాలయం వద్ద పిడుగుపాటుకి బచ్చలి యాదగిరి అనే రైతుకు చెందిన పాడిగేదె మృతిచెందింది.



న్యాల్‌కల్: మిర్జాపూర్(ఎన్)లో కురుస్తున్న భారీ వర్షం



నిజాంపేటలో గాలివానకు నేలకొరిగిన చెట్లు



చిన్నశంకరంపేట: జంగరాయిలో విగిరిపడ్డ చెట్టు